


# నరకసీమ

రచన: డి. యస్. పరమేశ్వరరావు

అడితీకి అవతల, రాములవారి దేవాలయం; ఇవతలవేపు కటకటాల డాబా, వెన్నెల్లో లక్ష్మీకాంతరావు సైకిలు త్రొక్కుతూ, ఒకఫీట్‌తో దేవాలయానికి నమస్కారం చేసి, సన్నని యీలపాటతో కటకటాల డాబాలోకి దూరాడు. ఆయన ఓవర్సీరు అయితేనేం, యిట్లాంటి డాబాలు లెక్కలేదు.

"ఇవాళ ఆలస్యమైందేమండీ," అంది జుట్టున్న అందమైన విధవరాలు శకుంతల.

'మా ఆవిడకూ, నాకూ కొంచెం....'

'రోజూ యింతేనాయేం? నేనైతే మీ అందానికి మీతో ఎంతో చక్కగా కాపురం చేద్దును!—ఇంతకీ ఆమెకు ప్రాప్తంలేదు; అయితే నన్నెప్పుడూ మీయింటికి తీసుకుపోరు; రేపు రానా?'

'అమ్మో--రేపే....మా ఆవిడతో యివ్వాళేగా, రభసాఅయింది — రెండు మూడు రోజుల్లో....' అన్నాడు లక్ష్మీకాంతరావు.

'రోజూ రభసాయే; ఏమయినా సరే తీసుకెళ్ళండి. మీ ఆవిణ్ని చూడాలని వుంది;' అంది శకుంతల.

'నామాట కొంచెం....సరేలే, రేపు తీసుకుపోతాను. సరేగాని అక్కడమాత్రం కొంచెం జాగ్రత్తగా మెలగాలి. వెళ్ళబోయేముందు అంతా బోధిస్తాలే!'

అర్ధరాత్రికి ఆ కటకటాలలోంచి బయట పడ్డాడు లక్ష్మీకాంతరావు. ఇంటికొచ్చి, తలుపు దబదబా బాదటం మొదలుపెట్టాడు.

'ఓయి వస్తున్నా ఆగండి .... అర్ధరాత్రి వేళ మద్దెలదరువు,' అంది అర్ధాంగి రామలక్ష్మి. తలుపు 'కీచు'మంటూ, నాంది ప్రస్తావన గావించింది.

'ఏమేవ్! భోజనానికి పిలిచాను. రేపు వంట పెందలకడనే గావాలి.'

'ఎవర్ని పిలిచారు? ఎక్కడకువెళ్ళారు?'

'అరెరె పొరపాటు .... పిలవలేదు .... ఉహుఁ పిలిచాను .... మన వియ్యంకుడు

సుబ్బారావుగార్ని; ఆయన్ని రేపు సుబ్బారాయుడు షష్ఠికి భోజనానికి పిలిచాను.'

'ఏమిటి ఆ ఖంగారు? రేపు షష్ఠిఏమిటి! వియ్యంకుణ్ని పిలవటమేమిటి! పొరపాటు ఏమిటి? వారానికి నాలుగుసార్లు వియ్యాలవార్ని పిలుస్తే యింక నేను చాకిరీ చెయ్యాలా. నేను చెయ్యలేను బాబూ....'

'నోరుముయ్యి. నేను చెప్పినట్లు చెయ్యి. ఇరవైసార్లు పిలుస్తాను, నలభైసార్లు పిలుస్తాను. అదయినా వాళ్ళ వూళ్ళో వున్నారు గా బట్టి. ఇష్టముంటే చెయ్యి కష్టమైతే మానెయ్యి,' అన్నాడు ఓవర్సీయరు గారు మేస్త్రీని దబాయించినట్లు.

'ఇదిగో యిటు చూడండి. నేను చాకిరీ ముమ్మాటికి చెయ్యలేను. ఏనుయ్యో, గొయ్యో చూసుకోవటం మెరుగు, యిట్లాంటి సంసారం చేసేకన్నా.' అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది రామలక్ష్మి.

లక్ష్మీకాంతరావు నుదుటిమీది చెమట బిందువుల్ని తుడుచుకుంటూ, 'నోరు మూస్తావా, తన్ననా?' అన్నాడు.

'నాన్నా మళ్ళీ ఏమిటీగోల? ఎవ్వరూ నిద్దర్లు పోనివ్వర్లేపా?' అంది కూతురు లలిత. నడిమంచంమీద లేచి కూర్చొని.

'ఏమందోయి రామలక్ష్మమ్మగారు! యిక పడుకోండి బాబూ' అంది, పక్కింటి మహాలక్ష్మమ్మగారు.

* * * *

శకుంతలను యింటికి తెచ్చేసరికి, రామలక్ష్మమ్మ వియ్యాలవారొస్తారనే భయంతో పుట్టింటికి వెళ్ళిపోయింది. పీడవదిలిపోయిందనుకున్నాడు, లక్ష్మీకాంతరావు. కూతురు లలిత, 'ఈమె'ఎవరని' నాన్ననడిగింది. 'మా స్నేహితుని బంధువు దారి తప్పి వచ్చింది; రేపుదయాన్నే వాళ్ళవూరు పంపిస్తాను. అయినా నీకెందుకీగొడవ?' అని గదమాయించాడు, కాపురానికి పోబోయే లలితను. లలితకు అసహ్యమేసింది. విషయాన్ని గ్రహించి, 'నాన్నా ఎందుకీగోల, అమ్మను తీసుకురా' అని కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకుంది. 'చస్తే తీసుకురాను! ఏదో ఒకటి తేలిపోవాలి. ఎన్నాళ్ళని యిట్లా పుట్టింటికి పారిపోతుందో చూస్తాను, అన్నాడు.

శకుంతల గృహిణి అయింది. రోజూ లలితకు, శకుంతలకు ఏదో ఒక అల్లరి జరుగుతూనేయుంది. అందుకని లలిత ఒకనాడు ధైర్యంచేసి, అత్తవారింటికిపోయి, 'మీయింటికి కాపురానికి వచ్చా'నని చెప్పింది. మామ సుబ్బారావుగారు తెల్లపోయాడు. కొడుకు ఓవర్సీయరు పరీక్షచదువుతున్నాడు. 'ఇంకా కార్యంకాలేదు, అప్పుడే కాపురం ఏమిటా.' అని ఖంగారుపడ్డాడు. ఊళ్ళోనే గాబట్టి, లక్ష్మీకాంతరావును కలుసుకుని, విషయాన్ని ప్రశ్నించాడు. 'దానికి బుద్ధిలేదు. యింటికి పంపివెయ్యండి; తల్లి పుట్టింటికి, కూతురు అత్తవారింటికి; బాగానేవుంది ఆడసామ్రాజ్యం', అని హుంకరించాడు. కాని సుబ్బారావుగారు, లక్ష్మీకాంతరావు ప్రవర్తన అంతా తెలుసుకోగలిగాడు. 'మా వాడు వచ్చింతరువాత వాడి యిష్టమైతే అట్లాగే పంపుతాను.' అన్నాడు.

శకుంతల రోజూ ఆఫీసుకు మేస్త్రీద్వారా టిఫిన్‌కారీయరులో అన్నం పంపుతోంది.

లక్ష్మీకాంతారావు యింట్లోలేనప్పుడు, ఆమెకు ఒక వేలువిడిచిన మేనల్లుడు యిక్కడకొచ్చి భోజనంచేసి పోతూంటాడు. ఇంక రోజూ ఫలహారాలకి, సినిమాలకి, లెక్క లేదు. తమ్ముళ్ళు గోపాలుడు, చలపతి ఎంతో చెప్పి చూశారుగాని లాభం లేకపోయింది. ఓవ ర్సీలుగారికొచ్చేజీతం, రెండురోజుల పట్టపగ లికి సరిపోతుంది: అయ్యగారికేంచెయ్యాలో తోచిందికాదు.

ఒకరోజున పుట్టింటినుంచి రామలక్ష్మమ్మ తిరిగొచ్చింది. ఇంట్లోవున్న శకుంతలను చూసి గాబరాపడింది, 'ఎవరు నువ్వు. వెళ్ళిపో!' అంది శకుంతల. 'నువ్వెవరివి నన్నడగటానికి ?' అంది రామలక్ష్మమ్మ. 'ఎవరినో ఆయనొచ్చిం తరువాత తెలుసు కుందువుగాని,' అని తలుపుకేసుమంటూంటే, దభామనివేసి గడియపెట్టింది. బయటిఅరుగు మీద రామలక్ష్మమ్మ శోకాలు పెడుతూ కూర్చుంది, సైకిలుమీద లక్ష్మీకాంతరావు వచ్చాడు. అర్ధాంగిని 'ఎందుకొచ్చావ'ని ప్రశ్నించాడు. 'నాయింటికి నేనొచ్చాను లోపల అదిఎవతె?' అని ఆమె ధీరస్వా చూపించింది. 'వియ్యాలవారొస్తే చాకిరీ చెయ్యటానికి తెచ్చాను. ఈయిల్లు యిక్కడ కాదు వెళ్లిపో,' అంటూ లోపలకుపోయి, శకుంతలను అన్నం వడ్డించమన్నాడు.

రామలక్ష్మమ్మ మళ్లీ పుట్టింటికిపోయింది. కూతుర్ని చూడటానికికూడా పోలేదు లక్ష్మీ కాంతరావు; కొన్నాళ్లకు శకుంతల అంటే కూడా మొహంమొత్తింది. లక్ష్మీకాంతరావు అంటే శకుంతలకు కూడా వెగటుపుట్టింది. ఒకరోజున, ఇంట్లోవుండే వెండి బంగారపు సామానుతీసుకుని మేస్త్రీతో లేచిపోయింది శకుంతల. 'వెండిబంగారం పోతేపోయింది, శకుంతలను వదలించు కున్నా'నని తృప్తి పడ్డాడు లక్ష్మీకాంతరావు. కదిలిస్తే మీద పడుతుందేమోనని, పోలీసురిపోర్టు యివ్వ టంకూడా మానేశాడు.

ఆఫీసులో పనివత్తిడి, అధికారుల వత్తిడి ఎక్కువైంది. ఇంట్లో ఆడదిక్కులేదు. సరిగావేళకు అన్నంలేక, హోటలు మెతు కులు సరిపడక, ఓవర్సీలుగారు చిక్కి పోయాడు. కొన్నాళ్ళకు, భార్యామీదకు గాలి మళ్లింది. ఆమెను తీసుకురావటానికి అత్త వారి వూరువెళ్లాడు, 'ఎందుకొచ్చారు? దాన్నే ఏలుకోండి; నేనురానేరాను,' అని మొండి కెత్తింది రామలక్ష్మి, కాళ్లగడ్డం పట్టుకుని బతిమిలాడుతున్నకొద్దీ ఆమెకుమొరటుతనం ఎక్కువైంది. చేసేదేం లేక, యింటికి తిరిగొచ్చి, మరో నాలుగురోజులకి, అల్లుడుగారింటికి పోయి కూతుర్ని పిలిచాడు. అల్లుడు సత్యనారా యణ, కూతుర్ని పంపనన్నాడు. మాడు ముఖంతో, సైకిలుమీదవస్తూ కటకటాలడాబా ముందు కాంగ్రెంచి పుమ్మేని, రాములవారి దేవాలయంవద్ద సైకిలుదిగి, లోపలుకుపోయి దేవుడికి నమస్కారంచేసి, యింటికొచ్చే సరికి, భార్య రామలక్ష్మమ్మ తాళంవేసివున్న వారియింటి అరుగుమీద కూర్చుని, లక్ష్మీ కాంతరావుగారి రాకకోసం నిరీక్షిస్తోంది. 'రానన్నదానివెందుకొచ్చావ' నిప్రశ్నించాడు. 'నాయిల్లుగాబట్టి నా యిష్టం వచ్చినప్పుడు, వస్తా'నంది రామలక్ష్మమ్మ. మారుమాట్లాడ కుండా సరాసరివెళ్ళి తమ్ముళ్ళు గోపాలుడు, చలపతిలతో కధంతాచెప్పి, ఆమెను ఏల టమా, ఏలుకోకపోవటమా, అనే విషయం గురించి సంప్రతించాడు.

'ఆదివరకు మామాట విన్నావుగాబట్టి యిప్పుడువింటావుగనకనా! నీకున్న సంసార దుఃఖం పగవాళ్ళకికూడా వద్దుబాబూ! నీ యిష్టంవచ్చినట్లు చేసుకో; నీజన్మ అట్లా వెళ్ళవలసిందే.' అని సమాధానం చెప్పారు. 'ఇంతకీ యిది నాఖర్మం' అని వాపోయాడు లక్ష్మీకాంతరావు. 'చేతులార చేసుకున్నదానికి ఖర్మంఏమిటి? సౌఖ్యమంటేఏమిటో, అనురాగ దాంపత్యం అంటే ఏమిటో నీకు అసలు తెలియనే తెలియదు. మళ్ళీ పదిహేళ్ళనుంచీ కాపురంచేస్తున్నావు. తమ్ముళ్ళమైన మాకుకూడా నీయింటికి రావడానికి భయమేస్తుంది. ఇందుకు నిన్ను నీవే నిందించుకోవాలి. ముమ్మాటికి నీవే కారకుడవు.' అన్నాడు గోపాలుడు.

సైకిలుమీదవస్తూ, కటకటాల డాబావేపు చూడనేలేదు లక్ష్మీకాంతరావు. ఈసారి రాములవారి దేవాలయంవేపుచూసి, ధుబుక్కుమన్నాడు, ఇంటికొచ్చి తలుపు తట్టాడు.

తలుపుకీచుమంటూ తెరుచుకుంది.

'ఎక్కడికిపోయారు, నీళ్ళుకాగి రెండు గంటలైతేను? కట్టెలు తగలబడిపోతున్నాయి. తొందరగా లేవండి స్నానానికి.' అంది రామలక్ష్మమ్మ.

'ఆ కట్టెలతో నీతల పగలకొట్టుకో!'

'నాకేంపట్టింది తలపగలకొట్టుకోవటానికి; ఈ సంసారం యీదలేనివాళ్ళే చేసుకుంటారు, ఆపని. పుణ్యంకొద్దీ పురుషుడు....' అంది రామలక్ష్మమ్మ.

తల రెండుచేతుల్తో పట్టుకుని కుర్చీలో జేరగిలబడ్డాడు. ఓవర్సీలు లక్ష్మీకాంతరావు.

—(0)—

